www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 నవంబర్ 2025

5

ఏలూరు



నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల మూడో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్ https:// meekosam. ap.gov.in ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 కాల్ చేయవచ్చని తెలిపారు.

కౌలు రైతులకు పరిహా(రం)సం..!

ఆరుగాలం కష్టపడింది కౌలు రైతులు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టింది కౌలు రైతులే. మొంథా తుపాను వల్ల జరిగిన పంట నష్టం నమోదులో భూ యజమానుల పేర్లు నమోదు చేస్తున్న పరిస్థితి నెలకొంది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంట నష్టం నమోదు చేస్తూ కౌలు రైతులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. పెట్టుబడి పెట్టిన కౌలు రైతుకు కాకుండా.. సాగుకు దూరంగా ఉన్న భూయజమానికి పంట నష్టపరిహారం అందించేందుకు సిద్ధమైంది. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు కౌలు రైతుల ఆత్మహత్యల గురించి మాట్లాడుతూ సొంత సొమ్ములు సాయం చేసిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఇప్పుడు నోరు మెదపకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట నష్టం కౌలు రైతులకు ఇవ్వాలంటూ సాగుదారులు కోరుతున్న పరిస్థితి నెలకొంది.



ఉంగుటూరులో దెబ్బతిన్న పంటను చూపుతున్న కౌలురైతు

వెబ్‌ల్యాండ్ ఆధారంగానే పంట నష్టం నమోదు

95 శాతం వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్లే

రెండు జిల్లాల్లో తుదిదశకు పంట నష్టం లెక్కలు

33 వేల ఎకరాల్లో వరికి నష్టం

ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టిన కౌలురైతు

నష్టపరిహారం సాగుచేయని భూయజమానికే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రస్తుత ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఏలూరు జిల్లాలో లక్షా 95 వేల ఎకరాలు, పశ్చిమలో 2.05 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగింది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వ్యవసాయ సాగులో 80 శాతం కౌలు రైతులే చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ముగుస్తున్నా ఇప్పటికీ కౌలు కార్డుల జారీ ప్రక్రియ పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ ఆరంభం నుంచి రైతులు ఎన్నో కష్టాలకు ఓర్చి ముందుకు సాగారు. పంట చివరి దశకు చేరిన సమయంలో మొంథా తుపాను విరుచుకుపడింది. పంట పొలాలు నేల కొరిగి నీటిలో నానుతున్నాయి. ఈనిక దశలో ఉన్న పొలాలు పనికి రాకుండాపోతున్న పరిస్థితి నెలకొంది. తుపాను తీరం దాటి సాధారణ పరిస్థితికి రాగానే వ్యవసాయాధికారులు పంట నష్ట నమోదుకు దిగారు. ఆదివారం సాయంత్రానికి దాదాపు పంటనష్టం ప్రక్రియ పూర్తయిన పరిస్థితి నెలకొంది. తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు 35 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాలు దెబ్బతినగా, ఏలూరు జిల్లాలో 12,560 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు తేలింది. ఇంత వరకూ బాగానే ఉంది. పంట నష్టమోదులో వాస్తవ సాగుదారుడైన కౌలు రైతుల పేర్లు కాకుండా భూ యజమానుల పేర్లు నమోదైన పరిస్థితి నెలకొంది. పంట నష్ట నమోదులో 95 శాతం మంది భూ యజమానులే ఉన్నారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంట నష్ట నమోదు జరుగుతోంది. వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్లు తప్ప కౌలురైతులను చేర్చలేదు. కౌలుకార్డులు అందుకున్నవారి పేర్లను చేర్చినట్లు అధికారులు చెబుతున్నా సాగు చేసిన రైతుల్లో ఐదు శాతం కూడా లేని పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వం ఇచ్చే పంట నష్టపరిహారం భూ యజమానుల జేబుల్లోకి వెళ్లిపోనుంది.

సొమ్ము ఒకరిది.. సోకు వేరొకరిది

దెబ్బతిన్న పంటలో అత్యధిక భాగం కౌలురైతులే సాగుచేసిన పరిస్థితి నెలకొంది. ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టి నష్టపోయారు. న్యాయ ప్రకారం నష్టపోయిన కౌలురైతులకు పరిహారం అందాలి. రెండు జిల్లాల్లో పంట నష్టపోయిన రైతులు 25 వేల మందికిపైగా ఉన్నారు. ప్రభుత్వం మాత్రం నష్టపోయిన కౌలురైతులకు కాకుండా సాగుచేయని భూయజమానికి నష్టపరిహారం అందించేందుకు సిద్ధపడుతోంది. దీంతో 'సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది అన్నట్లుగా పరిస్థితి తయారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎకరాకు రూ.పది వేల పంట నష్టపరిహారం అందించనుంది. కౌలురైతులకు అందితే పెట్టిన పెట్టుబడిలో కొంతైనా ఊరట లభిస్తుంది. అలాకాకుండా చిల్లిగవ్వ పెట్టుబడి పెట్టని భూ యజమానులకు పరిహారం ఇవ్వడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. బ్యాంకులు సైతం భూ యజమానులకే పంట రుణాలు ఇచ్చాయి. రుణాలు ఇచ్చే సమయంలో బీమా ప్రీమియం భూయజమానుల నుంచే కట్టించుకున్నారు. బీమా పరిహారం సైతం భూయజమానులకే వెళ్లనుంది. ఏటా ఇదే విధంగా కౌలురైతులకు అన్యాయం చేస్తున్నారు. దీంతో కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కౌలురైతుల ఆత్మహత్యలపై మాట్లాడడంతో పాటు, మృతి చెందిన కౌలురైతుల కుటుంబాలకు సొంత సొమ్ములు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. తాము అధికారంలోకి వస్తే కౌలురైతుల చట్టంలో మార్పులు తెచ్చి ఆదుకుంటామంటూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకూ కౌలురైతుల గురించి పట్టించుకోని పరిస్థితి. పంట నష్టపరిహారం నష్టపోయిన కౌలురైతులకే ఇవ్వాలంటూ సాగుదారులు కోరుతున్నారు. ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది.

డిసెంబరు 10వ తేదీలోపు

పనులు పూర్తి చేయకపోతే టెండర్లు రద్దు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

డిసెంబరు 10వ తేదీలోపు పనులు పూర్తి చేయకపోతే టెండర్లు రద్దు చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఆదివారం నూజివీడు పట్టణంలో మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతి ప్రగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొన్నారు. ఇప్పటివరకూ ఎన్ని పనులకు టెండర్లు పిలిచారు, ఎన్ని పనులు పూర్తయ్యాయి, ఎక్కడెక్కడ పనులు జరుతున్నాయని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ వంశీని మంత్రి ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డిసెంబరు 10వ తేదీలోపు చేపట్టిన పనులు పూర్తికాని పక్షంలో టెండర్లు రద్దు చేస్తానని, అధికారులను, కాంట్రాక్టు దారులను హెచ్చరించారు. గతంలో జరిగిన పనులకు ఎమ్, బుక్స్ అందజేయాలని మంత్రి అడగ్గా లేదని సమాధానం చెప్పడంతో ప్రభుత్వానికి సరెండ్ చేస్తానని హెచ్చరించారు. జనరల్ ఫండ్ ప్రలోభాలకు తలొగ్గి కొంత మందికే పనులు కేటాయిస్తున్నారని, ఇక మీదట అన్ని వార్డుల్లో సమానంగా పనులు కేటాయించాలని అధికారులకు ఆదేశించారు. ఆరేళ్ల క్రితం చేసిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించకపోవడంతో కారణాలు అడిగి తెలుసుకుని వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన రూ.15 కోట్ల పనుల వివరాలు తెలుసుకున్నారు. అదనంగా రూ.8 కోట్లు మంజూరు చేయమని మున్సిపల్ మంత్రికి అర్జీ చేశానని తెలిపారు. పనులు పూర్తికాలేదని, కాంట్రాక్టర్లు టెండర్లకు ముందుకు రావడం లేదని పొంతన లేని సమాధానం ఇచ్చిన ఎఇ పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం శానిటేషన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్‌ను శానిటేషన్ వర్క్‌పై ఆరా తీశారు. ఎక్కడెక్కడ ఎవరు పనిచేస్తున్నారని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో పని తీరు మార్చుకోండని హెచ్చరించారు. రెండు రోజుల్లో శానిటేషన్ పురోగతి సాధించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్, వైస్ ఛైర్మన్ పి.సత్యన్నారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షులు జగదీష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పార్థసారధి

మైసన్నగూడెంలో రాళ్ల కాలువ బాగు చేయాలి

పంటల ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి - రైతు సంఘం ఆధ్వర్యాన రైతుల నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని మైసన్నగూడెం, శ్రీనివాసపురం గ్రామాల పరిధిలో రాళ్ల కాలువను బాగుచేసి పైనుంచి వచ్చే మురుగునీరు వెళ్లేలా చర్యలు చేపట్టి పంటల ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మైసన్నగూడెంలో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతులు బొడ్డు దుర్గారావు, పాతూరి జానకిరామయ్య మాట్లాడారు. రాళ్ల కాలువ బాగు చేయకపోవడం వల్ల మైసన్నగూడెం, శ్రీనివాసపురం గ్రామాల పరిధిలో వందల ఎకరాలు పంట నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వర్టు నిర్మాణం లేకపోవడం వల్ల తమ పొలాలకు వెళ్లే మార్గం మూసుకుపోయి రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోందని చెప్పారు. మైసన్నగూడెం నుంచి పొలాలకు వెళ్లే రోడ్డు నిర్మాణం సరిగ్గా లేదన్నారు. రాళ్ల కాలువ బాగు చేయడానికి, కల్వర్టు, రోడ్డు నిర్మాణం చేయడానికి నిధులు కేటాయించాలని కోరారు. పంట నష్టాలను నమోదు చేసి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బొడ్డు రాంబాబు, సిరిబత్తుల సీతారామయ్య, రైతులు పాముశెట్టి లింగయ్య, పాముశెట్టి వెంకటేశ్వరరావు, పాముశెట్టి ఏసుబాబు, కుర్రు రాంబాబు, మునకన రామారావు, కుర్రు ప్రభాకర రావు, పల్లె ధర్మరాజు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతన్న నేతలు

అంధులైన టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.వీర్రాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంధులైన టీచర్స్‌ను టెట్ నుంచి మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.వీర్రాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కుందేటి జయరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2010కి ముందు డిఎస్‌సి ద్వారా నియామకం పొంది సర్వీస్ చేస్తున్న ఇన్ సర్వీస్ టీచర్లను కూడా టెట్ నుంచి మినహాయించాలని పేర్కొన్నారు. అలా కాకుండా డిఎస్‌సిలో ప్రతిభ కనబరిచి ఉద్యోగంలో కొనసాగుతూ ఉన్న అంధులైన ఉపాధ్యాయులకు మళ్లీ టెట్ నిర్వహిస్తే వారు కంప్యూటర్ ఆధారిత ఎగ్జామ్ రాయడం ఇబ్బంది కలుగుతుందని గమనించాలని తెలిపారు. అదేవిధంగా ఫేషియల్ అటెండెన్స్ నుంచి అంధులైన ఉపాధ్యాయులకు మినహా యింపు ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఇచ్చినప్పటికీ కిందిస్థాయిలో ఫేషియల్ అటెండెన్స్ అనేది వేయిస్తున్నారని తెలిపారు. ఆ జిఒను కిందిస్థాయిలో కూడా అమలు చేయాలని పేర్కొన్నారు.

ఊడుతున్న స్లాబ్ పెచ్చులు.. రక్షణ కరువు


ముసునూరు బాలురు, బాలికల వసతి గృహాల దుస్థితి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు బాలురు, బాలికల వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. విద్యార్థులు పలు సమస్యలతో సతమతం అవుతున్నారు. బాలుర వసతి గృహం స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ విద్యార్థిపై పడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. బాలికల వసతి గృహానికి ప్రహరీ తక్కువ ఎత్తులో ఉంది. దీంతో మహిళలకు రక్షణ కరువైంది.

ముసునూరు బాలికల వసతి గృహం హైస్కూల్‌కు అతి దగ్గరలో ఉంది. ఆ రెండు ప్రధాన భవనాల మధ్య ప్రహరీ చాలా తక్కువ ఎత్తులో ఉంది. దీంతో పాఠశాలలో ఆటలు ఆడుతున్న సమయంలో, సెలవు రోజుల్లో బయట వ్యక్తులు ఆటలు ఆడేందుకు వచ్చే సమయంలో విద్యార్థినులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కిటికీలు బాగానే ఉన్నా తలుపులకు చిన్న చిన్న రంధ్రాలు ఉన్నాయి. వసతి గృహంలో మంచాలు లేకపోవడంతో కటిక నేలపైనే పడుకునే పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలపై వార్డెన్ హిమబిందును వివరణ కోరగా ప్రహరీ గోడ నిర్మించాలని, మంచాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాలుర వసతి గృహంలో భోజనశాలలో స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఎప్పుడు ఏ విద్యార్థిపై పడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. వర్షం కురిసిన సమయంలో చెమ్మ కిందికి దిగి అక్కడక్కడ వర్షపు నీరు చేరుతుంది. మరుగుదొడ్లు, కిటికీలు, తలుపులు బాగానే, పరిసరాల పరిశుభ్రత బాగానే ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. వసతి గృహంలో 28 మంది విద్యార్థులకు మంచాలు, దుప్పట్లు ఉన్నాయని తెలిపారు. ఇన్‌ఛార్జి వార్డెన్ కావడంతో ప్రతిరోజూ రావడం లేదని, పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు. వార్డెన్ శ్రీదేవిని వివరణ కోరగా తమ హాస్టల్ అంతా బాగానే ఉందని, భోజన శాలలో మాత్రం స్లాబ్ పెచ్చులు ఊడిపోయి చాలా ఇబ్బందికరంగా ఉందని చెబుతున్నారు. పర్మినెంట్ వార్డెన్ అయితే ప్రతిరోజూ విద్యార్థులపై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.



ఊడుతున్న స్లాబ్ పెచ్చులు



తక్కువ ఎత్తులో ఉన్న ప్రహరీ

ప్రజాశక్తి పరిశీలన

నేడు వామపక్ష రాష్ట్ర నాయకుల బృందం పర్యటన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని వంకావారిగూడెంలో నిర్మించ తలపెట్టిన ఆయుధ డిపో సమస్యపై వామపక్షాల రాష్ట్ర నాయకుల బృందం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు యు.వెంకటేశ్వరరావుతో పాటు వివిధ వామపక్ష పార్టీల జిల్లా నాయకులు నేడు పర్యటిస్తారని నేవీ ఆయుధ డిపో వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు. ఆదివారం రాష్ట్ర నాయకుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించామన్నారు. ఈ పర్యటనకు ఆయా గ్రామాల్లో ప్రజలు అందుబాటులో ఉండి నాయకులకు వారి అభిప్రాయాలను తెలియజేయాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, కారం దారయ్య, భూషణం, సిరిబత్తుల సీతారామయ్య, ఎం.శేషగిరి, మల్లేశ్వరరావు, రవి, శంకరుడు తదితరులు ఉన్నారు.

నేవీ ఆయుధ డిపోను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసులను నిర్వాసితులుగా చేసే నేవీ ఆయుధ డిపో ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని ఏజెన్సీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం కేంద్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో నిర్మించ తలచిన నేవీ ఆయుధా డిపో ప్రాంతాన్ని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుజం రామారావు, జిల్లా నాయకులు సవలం రాంబాబు, మిడియం రవిదొర, అరగంటి జోగి రెడ్డి మండలంలోని వంకవారి గూడెం పంచాయతీలో మడకం వారి గూడెం, కొత్తచీమలవారి గూడెం, దాట్లవారిగూడెం, వంకావారి గూడెం గ్రామాలకు వెళ్లి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలూ నేవీ ఆయుధ డిపోను నిర్మించొద్దని బలంగా అభిప్రాయపడుతున్నారన్నారు. ఇప్పటికే మూడు సార్లు జరిగిన గ్రామసభల్లోనూ పీసా గ్రామ సభల్లోనూ, పంచాయతీలోనూ ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేసినప్పటికీ ప్రజా అభిప్రాయాన్ని పక్కనపెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేవీ ఆయుధ డిపోను ఏర్పాటు చేయాలనే ఆలోచన దుర్మార్గమని తెలిపారు. ఈ ఆలోచనను విరమించుకోవాలని ఏజెన్సీ గిరిజన సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. ఈ ఆయుధ డిపోలో ఏ చిన్న ప్రమాదం జరిగిన వందల కిలోమీటర్ల దూరంలో విపత్కర పరిస్థితిలో ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం దాట్లవారిగూడెం గ్రామంలో జరిగిన సమావేశంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుజం రామారావు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా అభివృద్ధి పేరుతో నిర్మిస్తున్న ప్రాజెక్టులు లక్షల దిమంది ఆదివాసులు నిర్వాసితులు అవుతున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వల్ల లక్షల మంది గిరిజనులు నిర్వాసితులు అయ్యారని, వారికి ఇంతవరకూ పునరావాసం కల్పించలేదని, నిర్వాసితులు భూముల్లేక చేయడానికి పనుల్లేక వారు ఎదుర్కొంటున్న బాధలు చూస్తున్నామని అన్నారు. తక్షణం వంకా వారి గూడెం పంచాయతీలో నిర్మించ తలపెట్టిన నేవీ ఆయుధ డిపోను ఉపసంహరించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు మాట్లాడుతూ నేవీ ఆయుధం డిపో ఏర్పాటు జరగడం వల్ల ఆ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని పాలకులు చెప్పడం వట్టి బూటకం అన్నారు. ఈ ఆయుధ డిపో వల్ల చాలా ఉద్యోగాలు వస్తాయని మోసపుచ్చడానికి ఈ ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆదివాసులను భూముల నుండి గ్రామాల నుండి దూరం చేసే విధానాలకు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజానీకం ఐక్యంగా పోరాడాలన్నారు.



మాట్లాడుతున్న నేతలు

చిన వెంకన్న దేవస్థానంలో మెరుగైన సేవలందించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల ఆలయంలో యాత్రికులకు మరింత మెరుగైన సేవలందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్వామివారి దర్శనం అనంతరం దేవాలయంలో యాత్రికులు దేవస్థానం అధికారులు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆలయానికి విచ్చే సామాన్యులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యాత్రికులు క్యూలైన్లలో ఎక్కువ సేపు వేచి ఉండకుండా త్వరితగతిన దర్శనం కలిగేలా చూడాలన్నారు. యాత్రికులకు అన్న ప్రసాదం సరైన నాణ్యతతో ఉండేలా చూడాలని, వంటశాలలో పూర్తి పరిశుభ్రతతో ఉండేలా ఆలయ అధికారులు పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సౌకర్యాలను గురించి, దర్శనానికి పట్టే సమయం, ఆలయ సిబ్బంది ప్రవర్తన తదితర అంశాలపై పలువురు యాత్రికులను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్న ప్రసాదశాలకు చేరుకొని, వంటశాల పరిశుభ్రత, అన్న ప్రసాదం వడ్డించే తీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆలయ ఇఒ, తహశీల్దార్, ప్రభృతులు పాల్గొన్నారు.



వంటశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

నిరంతర పోరాట యోధుడు బాబూరావు

నివాళులర్పించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు మృతి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గానికి తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. చింతకాయల బాబూరావు మృతికి నివాళులర్పిస్తూ ఆదివారం ఉద్దరాజు రామం భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ సాధారణ రైస్ మిల్లు కార్మికుడిగా సిఐటియులోకి వచ్చిన బాబూరావు 40 ఏళ్ల పాటు ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ నిరంతర పోరాట యోధుడిగా నిలిచారన్నారు. జిల్లాలో జరిగిన శ్రామిక ఉద్యమాల్లో ప్రత్యేక్షంగా పాల్గొని లాఠీ దెబ్బలకు, పోలీసుల తూటాలకు ఎదురొడ్డి నిలబడిన వ్యక్తి బాబూరావు అని కొనియాడారు. గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని కూడా ఉద్యమాల్లో అగ్రభాగాన పాల్గొంటూ స్ఫూర్తివంతమైన జీవితం గడిపారని చెప్పారు. తన మరణానంతరం కూడా తన శరీరం ప్రజలకే ఉపయోగపడాలని తన శరీరాన్ని ఆశ్రమం మెడికల్ కాలేజీకి దానం ఇచ్చే విధంగా కుటుంబ సభ్యులు సహకారంతో ముందుగానే నిర్ణయించుకున్న త్యాగశీలి బాబూరావు అని కొనియాడారు. జిల్లాస్థాయిలో బాబూరావు సంతాప సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ, నాయకులు గొట్టాపు రవికిషోర్, వైఎస్.కనకారావు, జి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




నివాళులర్పిస్తున్న నేతలు

శ్రీవారి సేవలో సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఆదివారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జితేంద్రకుమార్ మహేశ్వరి, హైకోర్టు న్యాయమూర్తి సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ దర్శిం చుకున్నారు. ఆలయ అధికారులు, ఆలయ వంశపారం పర్య ధర్మకర్తలు ఎస్‌వి.సుధాకరరావు, నివృతారావు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్, ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, సిఐ విల్సన్, ఎస్ఐ టి.సుధీర్, జిల్లా న్యామూర్తులు, ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయంలో న్యాయమూర్తులు

ప్రజాశక్తి
www.prajasakti.com



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

6న రాష్ట్ర సదస్సు : సిఐటియు

పాల్గొనున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా ఈ నెల ఆరో తేదీన జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, నాయకులు వైఎస్.కనకరావు, పంపన రవికుమార్, వివిఎన్.ప్రసాద్, జి.కోటేశ్వరరావులతో కలిసి రాష్ట్ర సదస్సు ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభ ఆంధ్రప్రదేశ్లో మొదటిసారిగా డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతుందని చెప్పారు. మహాసభ సందర్భంగా కార్మిక వర్గాన్ని చైతన్య పరిచేందుకు ప్రపంచ పరిణామాలు సోషలిజమే పరిష్కారమనే అంశంపై రాష్ట్ర సదస్సును సీతారామ భర్తీయా మర్చంట్ కళ్యాణమండపంలో ఆరో తేదీ ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు ముఖ్య వక్తగా హాజరవుతారని చెప్పారు. సిఐటియు అనుబంధ ఉద్యోగ కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

రంజిత్‌కుమార్‌ను శిక్షించాలి

ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భర్తతో పాటు భర్త అన్నతో కాపురం చేయాలని యువతిని వేధిస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన రంజిత్‌కుమార్‌ను, అతని తల్లిదండ్రులను, అన్నను తక్షణమే కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, శ్యామలరాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక మహిళ అయి ఉండి ఇంత దారుణంగా సాటి మహిళను వేరేవారితో కాపురం చేయమనడం సిగ్గు చేటని తెలిపారు. అధికారులు తక్షణమే వీరిపై కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని పేర్కొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల మూడో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) నిర్వహించనున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మండల కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచి ప్రభుత్వ అధికార వెబ్‌సైట్ http://meekosam.ap.gov.in ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వ్యకాస జిల్లా మహాసభ జయప్రదానికి పిలుపు


ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈ నెల 5, 6 తేదీల్లో టి.నర్సాపురంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం 32వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షులు తట్టి కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు మండల పరిధిలో ఉన్న పలు రంగాలకు చెందిన వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రమాదాలను నివారించడంలో హెల్మెట్ పాత్ర కీలకమని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ అన్నారు. ఆదివారం ఆగిరిపల్లి నూజివీడు-విజయవాడ మెయిన్ రోడ్డు, వడ్లమాను సమీపంలో పలువురు వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఆయన అవగాహన కల్పించారు.



కార్యదర్శిగా ఎన్నికైన రామకృష్ణబాబు

ఎపి సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం, నూజివీడు డివిజన్ యూనిట్ సంయుక్త కార్యదర్శిగా ఆగిరిపల్లి మండల సర్వేయర్ ఎస్.రామకృష్ణబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం, నూజివీడు డివిజన్ యూనిట్లకు సంబంధించిన ఎపి సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలను ఎన్నికల అధికారి ఎన్.విజయరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ నూతన కమిటీ అధ్యక్షులుగా టి.బ్రహ్మదేవుడు, కార్యదర్శిగా కె.లత, ఉపాధ్యక్షులుగా సిహెచ్.దుర్గయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎస్.రామకృష్ణబాబు, కోశాధికారిగా ఎం.ప్రేమ్‌కుమార్ మరో ఆరుగురు సభ్యులతో కలిసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన ఆగిరిపల్లి మండల సర్వేయర్ రామకృష్ణబాబును తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

నేరాలు - ఘోరాలు

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

భార్య మీద కోపంతో భర్త పురుగుల మందు తాగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రమణక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన అమురారి రమేష్, శ్యామల దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా రమేష్ మద్యానికి బానిసై పనులకు వెళ్లడంలేదు. ఈ విషయంపై భార్య ప్రశ్నించినప్పుడు చనిపోతానని తరచూ బెదిరించేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం బైక్ కొనాలని రమేష్ తన భార్యతో చెప్పాడు. ఆమె డబ్బులు తీసుకొచ్చేందుకు రమణక్కపేట బ్యాంకుకు వెళ్లింది. అదే సమయంలో రమేష్ తన భార్యకు ఫోన్ చేసి నేను అడిగింది లక్ష రూపాయల బైక్, నువ్వు 50 వేలు మాత్రమే అంటున్నావంటూ ఫోన్‌లో దుర్భాషలాడుతూ పురుగుల మందు తాగేశానని చెప్పాడు. దీంతో శ్యామల వెంటనే ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులకు విషయం చెప్పి రమేష్‌ను నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రమేష్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆదివారం మృతురాని భార్య ఫిర్యాదు మేరకు ముసునూరు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై దాడి

10 మంది అరెస్టు

ముదినేపల్లి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. పదిమంది వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి బహిరంగ ప్రదేశాల్లో పేకాట ఆడడం చట్టరీత్యా నేరమని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నీటిలో నానుతున్న వరి పంట

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ సాగులో అడుగడుగునా ఇబ్బందులు ఎదురుతువున్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి జులై నెల అక్టోబర్ వరకు నాలుగు నెలల కాలంలో పలుమార్లు అధిక వర్షాలు కురిసి వరి, పత్తి, మినుము పంటలు బాగా దెబ్బ తిన్నాయి. ఈ ఏడాది రైతులకు ఎదురవుతున్న కష్టాలు ఎప్పుడూ రాలేదని రైతులు చెబుతున్నారు. ముసునూరు, లోపూడి, చెక్కపల్లి, గుడిపాడు, గుళ్లపూడి గ్రామాల్లో వరి పంటలో నాగర్జున సాగర్ నీళ్ల పంట పొలాలపై అధికంగా పోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగష్టు, సెప్టెంబర్‌లో అత్యధిక తుపాన్లు రావడం వల్ల కూడా పంటలు బాగా దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం 32 శాతం నష్టం జరిగితేనే నష్ట



నేలకొరిగిన పంట

తుపాన్ ప్రభావంతో నష్టపోయామని రైతుల ఆవేదన ...... ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

పరిహారం లభిస్తుందని నిబంధనలు పెట్టారని చెబుతున్నారు. మూడు రోజుల నుంచి పంటలు నీటిలోనే తేలియాడుతున్నాయని, దీంతో దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొన్ని ప్రాంతాల్లో వాగులు, వంకల్లో నీరు పొలాలపై పారుదల కావడమే అధిక నష్టమని నూజివీడు డివిజన్ ఎడిఎ ఎ.సుబ్బారావు తెలిపారు. వరి, మినుము, పత్తి పంటలను సిపిఎం నేతలు పరిశీలించి తుపాన్ ప్రభావం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోయారని, వారికి నష్ట పరిహారం అందించాలని, లేకపోతే జిల్లా, డివిజన్, మండల స్థాయి వ్యవసాయ కార్యాలయాల వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు



వసతిగృహంలో మేరీగ్రేస్, రత్నప్రసాద్

ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఈ నెల తొమ్మిదో తేదీ జాతీయ న్యాయసేవాధికార సంస్థ దినోత్సవంలో భాగంగా ఆదివారం భీమడోలు మండలం పొలసానిపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో బాలికలకు న్యాయవాద విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.మేరీ గ్రేస్ మాట్లాడుతూ నేటి సమాజంలో సైబర్ నేరాలు అధికంగా ఉన్నాయని, బాలికలు సెల్‌ఫోన్లను ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, అటువంటి వారికి వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయకూడదని సూచించారు. భారతదేశంలోని ప్రతి బాల, బాలికలను ఉన్నత శిఖరాలను చేర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, అందులో భాగంగా ఉచిత విద్య, వసతి, ఆహారం, వైద్యం ప్రతి విద్యార్థికి అందించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. అటువంటి సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధిలో పథంలో నడవాలని, లోటుపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలతో పాటు ఉచిత న్యాయ సహాయం అందించాలనే ఉద్దేశంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా సమాజంలో ప్రతిఒక్కరినీ చైతన్య పరచాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సమాజంలోని అట్టడుగున ఉన్న ప్రజలు, న్యాయ సహాయం అవసరమైన న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించాలని, 15100 (టోల్ ఫ్రీ) ద్వారా ఉచితంగా న్యాయ సలహాలను పొందవచ్చని సూచించారు. వంటశాల, భోజనశాలను, పరిసరాలను మరింత శుభ్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ లక్ష్మణ్, గురుకుల పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నూరుశాతం నెరవేరుస్తూ ప్రజలు మెచ్చే పాలన అందిస్తున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి వెల్లడించారు. పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు దాతలు తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని, సాయం పొందిన వారు దాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం ప్రజావినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దివ్వెల జయబాబు, మరికొందరు దాతల సహకారంతో కళాశాల ఫీజులు చెల్లించేందుకు బూరా మౌనిక, నూకపెయ్యి ప్రణీత్, ఆలపాటి సాయి గణేష్‌లకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమ యజ్ఞం నిరాటంకంగా కొనసాగుతోందని చెప్పారు. ఇదేక్రమంలో ప్రజాసమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా సహకారం అందించడంతో పాటు దాతృత్వంతో ముందుకొచ్చి పేదలకు సహాయం అందిస్తున్నవారిని ప్రోత్సహిస్తూ మరి కొందరికి వారి ద్వారా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారాన్ని అందిపుచ్చుకున్న వారు దాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దివ్వెల జయబాబు, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, ఆర్నెపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

అందరూ కలిసి మెలిసి ఉండాలి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అందరూ కలిసి మెలిసి ఉండాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం టౌన్‌లో ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో దేవతిలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఎల్ఎ మాట్లాడుతూ దేవతిలకుల సంఘం పెద్దలను ఉద్దేశించి, జాతి సమైక్యత, అభివృద్ధి, సంక్షేమానికి తాను కృషి చేస్తానని చెప్పారు. సంఘానికి ఎలాంటి అవసరం ఉన్నా పెద్ద దిక్కుగా తాను ఉంటానని చెప్పారు. అన్ని కులాలను గౌరవిస్తూనే ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఏడాదికి ఒకసారి సంఘీయులంతా ఒకచోట కలుసుకుని కష్టసుఖాలు పంచుకుని ఆనందంగా గడపడమే కార్తీక వన సమారాధన ముఖ్య లక్ష్యమన్నారు. ఎప్పుడూ కలిసి మెలిసి అందరూ ఒక యూనిటీగా ఉండి రాజకీయాలకు అతీతంగా సంఘంలో ఎవరికైనా కష్టం వస్తే అందరూ ఏకమై ఆకుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. సంఘ పెద్దలు మాట్లాడుతూ తమ సంఘ సభ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం తరపున సహాయం అందేలా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, పెనుమర్తి రామ్‌కుమార్, సీనియర్ నాయకులు పరిమి సత్యనారాయణ, రామాంజనేయులు, మాణికల నాగేశ్వరరావు, కూటమి నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గురజలో కార్తీక వన సమారాధన

ముదినేపల్లి : మండలంలోని గురజ శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొర్రా చలమయ్య, వీరాబత్తిన సుధ, అడుసుమిల్లి రామకృష్ణ, మాజీ సర్పంచి కామినేని వెంకటేశ్వరరావు(బుజ్జి), జాస్తి వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి ప్రవీణ్‌కుమార్, వీరిశెట్టి కొండలు, ఆరేట్ల నాగరాజు, ఏలకాయల వెంకటేశ్వరరావు, తొందురూ శివ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వణుదుర్రులో కార్తీక అన్న సమారాధన

ముదినేపల్లి : మండలంలోని వణుదుర్రు ఆశ్రయం వద్ద ఆదివారం కార్తీక అన్న సమారాధన నిర్వహించారు. ఈ వన సమారాధనకు మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.



కలిదిండిలో..

9న వన సమారాధనను జయప్రదం చేయండి

కలిదిండి : నరసాపురం నియోజకవర్గం మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో ఈ నెల తొమ్మిదో తేదీన జరగే అగ్నికుల క్షత్రియ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు కోరారు. అగ్నికుల క్షత్రియ నాయకులు కొల్లాటి బాబూరావు, బర్రి నాగరాజు, మోకా ఏడుకొండలుతో కలిసి మండలంలోని పెదపుట్లపూడి, పెదలంక పల్లవపాలెం, మట్టగుంట, కొండంగి పల్లవపాలెం గ్రామాల్లో అగ్నికుల క్షత్రియులను కలిసి వనసమారాధన పత్రికలను అందించారు. అగ్నికుల క్షత్రియ స్థానిక నాయకులు మోకా రామకృష్ణ, తిరుమలశెట్టి సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, ఈశ్వర పరశు రాముడు, కొల్లాటి కొత్తరాజు, అంద్రాజు హన్మంతరావు, పొన్నాల లక్ష్మణరావు, బొడ్డు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు



బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

ప్రజాశక్తి - మండవల్లి

మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రామంలో వ్యాధులు సోకకుండా పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టామని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఉందన్నారు. పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని సిబ్బందితో తొలగించి పూర్తిస్థాయిలో బ్లీచింగ్ సున్నం చల్లిస్తున్నామన్నారు. అంతేకాకుండా దోమలకు ఆవాసంగా ఉన్న చెత్తకుప్పలను జెసిబి ట్రాక్టర్లతో సహాయంతో డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎం.కొండలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటిన మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని తన వాహనంలో ఆసుపత్రికి తరలించి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అందే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. మంత్రి పార్థసారథి ఆదివారం నూజివీడు పర్యటనకు వెళ్లే మార్గంలో వస్తుండగా నేషనల్ హైవేలో రోడ్డు ప్రమాదానికి గురైన జోజిబాబును చూసి వెంటనే కాన్వాయిని ఆపి ప్రమాదానికి గల కారణాలు వారి వివరాలు తెలుసుకున్నారు. నిడమానూరు విజయవాడ ప్రాంతానికి చెందిన జి.జోజిబాబు వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోడ్డు ప్రమాదానికి గురై నిస్సహాయక స్థితిలో పడిఉన్న జోజిబాబును మంత్రి పరామర్శించి ధైర్యం చెప్పి తమ వాహనంలో విజయవాడ సిద్దార్థ హాస్పటల్ వారితో మాట్లాడి వ్యక్తిగత సిబ్బందిని ఇచ్చి పంపించారు. మెరుగైన వైద్యం అందించామని వైద్యులను ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకునే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జోజిబాబు కుటుంబానికి అండగా ఉండాలని, తక్షణమే సహాయ సహకారాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మంత్రి చొరవతో మా నాన్న ప్రాణాలు దక్కాయని జోజిబాబు ఇద్దరు కుమార్తెలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.